క్లుప్తంగా

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



స్టేడియం ప్రాంగణంలో శుభ్రం చేస్తున్న డీఎస్‌డీఓ భూపతిరావు తదితరులు

కర్నూలు (టౌన్): పరిసరాల శుభ్రత మనందరి బాధ్యత అని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. సోమవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో స్వచ్ఛాంధ్ర– స్వర్ణ దివాస్ కార్యక్రమంలో భాగంగా స్టేడియం ప్రాంగణంలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. చీపుర్లతో ఊడ్చారు. చెత్త చెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా డీఎస్‌డీఓ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛత కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రతను ప్రతి ఒక్కరు పాటించాలన్నారు.

నిత్య సాధనతో ఉత్తమ ఫలితాలు



తైక్వాండో క్రీడాకారులకు బెల్టులు ప్రదానం చేసిన రామాంజనేయులు

కర్నూలు (టౌన్): క్రమం తప్పకుండా సాధన చేస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. సోమవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో రెండవ రోజు బెల్టు గ్రేడింగ్ పోటీలు ముగిశాయి. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ఆయన బెల్టులు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారులు అదే స్ఫూర్తితో రాష్ట్ర స్థాయిలో సత్తా చాటాలన్నారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి టి.వెంకటేశ్వర్లు, పీఈటీల సంఘం ప్రతినిధి చిన్న సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులను అరికట్టడంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న సుజాత

కర్నూలు(సెంట్రల్): రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులను నివారించడంలో హోంమంత్రి అనిత విఫలమయ్యారని ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి సుజాత విమర్శించారు. సోమవారం సీఆర్ భవన్‌లో ఏపీ మహిళా సమాఖ్య ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 8 నెలల కూటమి పాలనలో రోజూ ఎక్కడో ఒక చోట మహిళలపై దాడులు జరుగుతున్నాయన్నారు. వాటిని అరికట్టడంలో హోంమంత్రి విఫలమైందన్నారు. మహిళలపై దాడుల కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులు, ప్రత్యేక విచారాణాధికారులను నియమించాలన్నారు. తక్షణమే కూటమి సర్కారు సూపర్ సిక్స్‌లోని హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు భారతి, పావని, మునెమ్మ పాల్గొన్నారు.

కామన్ పీజీ సెట్‌ను రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

కర్నూలు కల్చరల్: కామన్ పీజీ సెట్‌ను రద్దు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సోమన్న, షాబీర్ బాషా డిమాండ్ చేశారు. సోమవారం రాయలసీమ యూనివర్సిటీ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీఓ నంబర్ 77ను రద్దు చేయాలన్నారు. ఎన్నికల ముందు విద్యార్థులకు ఇచ్చిన హామీలను నారా లోకేష్ నిలబెట్టుకోవాలన్నారు. ధర్నాలో నగర అధ్యక్షుడు అభి, నాయకులు సిద్దు, అరవింద్, హేమంత్, వెంకటేష్, రవి, విష్ణు, రాకేశ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ పరేషాన్!

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వాహనాల పార్కింగ్ సమస్యలు వేదిస్తున్నాయి. ముఖ్యంగా అత్యవసర విభాగానికి, ఓపీ చికిత్సకు వచ్చే రోగులు, వారి సహాయకులు సుదూర ప్రాంతంలో వాహనాలను పార్కింగ్ చేసి రావాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఓపీ, క్యాజువాలిటీ విభాగాల ఎదురుగానే ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసేవారు. అయితే అంబులెన్స్‌ల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందనే ఉద్దేశంతో అధికారులు ఆ ప్రాంతంలో వాహనాలను నిలపనీయడం లేదు. కాగా ఇదే ప్రాంతంలో నాలుగు చక్రాల వాహనాలు మాత్రం పార్కింగ్ చేయిస్తున్నారు. ఇందులో ఆసుపత్రి అధికారులు, వైద్యులతో పాటు ప్రైవేటు వ్యక్తుల వాహనాలు కూడా ఉంటున్నాయి. ఈ వాహనాలు అంబులెన్స్‌ల రాకపోకలకు అడ్డంకి కావా? అని ద్విచక్ర వాహనదారులు సెక్యూరిటీ గార్డులతో వాగ్వాదానికి దిగుతున్నారు. అత్యవసర వైద్యం కోసం వస్తే ఎక్కడో వాహనం ఆపి రావాలంటే ఎలా? అంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు.



క్యాజువాలిటీ ఎదురుగా ద్విచక్ర వాహనాలకు పార్కింగ్‌కు అనుమతించని సెక్యూరిటీ గార్డులు

దీంతో సెక్యూరిటీ గార్డులు, వాహనదారులకు నిత్యం ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంటోంది. డయాగ్నోస్టిక్ బ్లాక్‌కు ఇరువైపులా స్థలాన్ని ఖాళీ చేయిస్తే వాహనాల పార్కింగ్‌కు అనువుగా ఉంటుంది. ఇదే సమయంలో వాహనాలను దొంగలు ఎత్తుకెళ్తున్న ఘటనలు తరచూ జరుగుతున్నాయి. అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

– కర్నూలు(హాస్పిటల్)



ఓపీ విభాగం ఎదురుగా పార్కింగ్ చేసిన కారు

రాత్రి వేళ గస్తీ పెంచండి

కర్నూలు (టౌన్): రాత్రి వేళ గస్తీ పెంచండి. డ్రంకన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ తనిఖీలు నిర్వహించాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే వారి పట్ల మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. సోమవారం సాయంత్రం జిల్లా ఎస్పీ నాలుగవ పట్టణ పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరును, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. తగిన సూచనలు సలహాలు చేశారు. పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నేరాలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. ‘నేను సైబర్ స్మార్ట్’ పేరుతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను క్లియర్ చేయాలన్నారు. నాలుగవ పట్టణ సీఐ మధుసూదన్ గౌడ్, ఎస్‌ఐలు షమీర్ బాషా, చంద్రశేఖర్, గోపీనాథ్ పాల్గొన్నారు.



నాలుగవ పట్టణస్టేషన్‌లో తనిఖీ చేస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు విస్తృతం



మాట్లాడుతున్న సమితి అధ్యక్షుడు సందడి మహేశ్వర్

కర్నూలు కల్చరల్: భరత మాత సేవా సమితి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, సామాజిక, ధార్మిక, సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని సమితి అధ్యక్షుడు సందడి మహేశ్వర్ తెలిపారు. సోమవారం రెవెన్యూ కాలనీలోని వీహెచ్‌పీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 26వ తేదీన భరతమాత ఆలయంలో శివరాత్రి వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు. శివపార్వతుల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. సమితి కార్యదర్శి అయోధ్య శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి పెద్ద పుల్లారెడ్డి, సహ కార్యదర్శులు ప్రతాప్‌రెడ్డి, చంద్రారెడ్డి, సభ్యులు లావణ్య, నారాయణరెడ్డి, భరద్వాజ్, అరుణ్, రాము తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

కర్నూలు(రూరల్): డివిజన్ పరిధిలో రైతులు ప్రధానంగా పత్తి, కంది, జొన్న, ఆముదాలు, శనగలు, పొగాకు, మిరప తదితర పంటలు సాగు చేస్తున్నారని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ కోరారు. సోమవారం కర్నూలు ఆర్డీఓ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో రైతు సంఘం నాయకులు ధర్నా నిర్వహించారు. వారు మాట్లడుతూ.. ఈ ఏడాది వర్షభావ పరిస్థితుల వల్ల దిగుబడులు అంతంత మత్రమే వచ్చాయన్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకుండా రైతులను మోసగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంట దిగుబడులకు మద్దతు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి అర్జీని అధికారులు త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఆరులైన్ల రోడ్డులో భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. నాయకులు నాగన్న, ఆంజనేయులు, బాలవీర, వెంకటేశ్వర్లు, రఘువేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

సి.బెళగల్: మండలంలోని తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. సోమవారం ఉదయం ఎస్‌ఐ తిమ్మారెడ్డి సిబ్బందితో గ్రామాల్లో గస్తీ నిర్వహిస్తుండగా తుంగభద్ర నదీతీర గ్రామమైన గుండ్రేవుల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న తెలంగాణ ప్రాంతానికి చెందిన మూడు టాక్టర్లు కనిపించడంతో వాటిని పట్టుకొని సీజ్ చేశారు.అక్రమార్కులపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులకు అప్పగిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



సి.బెళగల్‌లో పోలీస్‌లకు పట్టుబడ్డ ఇసుక ట్రాక్టర్లు

సాంకేతిక వినియోగంతో సమస్యల పరిష్కారం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి టీజీ భరత్, కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు (టౌన్): మారుతున్న కాలానికనుగుణంగా అధునాతన సాంకేతిక సేవల వినియోగంతో కష్టతరమైన సమస్యలను సైతం వేగవంతంగా పరిష్కరించవచ్చని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. సోమవారం స్థానిక జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, మేయర్ బీవై రామయ్య, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, కమిషనర్ రవీంద్ర బాబుతో కలిసి అశోక్‌నగర్‌లో నీటి శుద్ధి కేంద్రం వద్ద రూ.4.62 కోట్లతో నీటి వ్యవస్థ నిర్వహణకు, రూ.1.5 కోట్లతో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ద్వారా మంజూరైన 3 శుభ్రతా పనుల యంత్రాలు, 2 చెత్త సేకరణ ఎలక్ట్రికల్ వాహనాలను ప్రారంభించారు. జగన్నాథగట్టు మీద ఉన్న ట్రిపుల్ ఐటీకి తాగునీరు అందించేందుకు రూ.22 కోట్లతో 12 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటు, సంపు, పంపింగ్ స్టేషన్ ఏర్పాటుకు శంకు స్థాపన పనలు చేశారు. డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, ఎస్‌ఈ రాజశేఖర్ పాల్గొన్నారు.

కర్నూలు(హాస్పిటల్): కర్నూలులోని ప్రాంతీయ ప్రభుత్వ సర్వజన వైద్యశాలను మంత్రి టీజీ భరత్, జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాతో కలిసి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య పరికరాలను పరిశీలించారు. పీజీ టీచింగ్ కోసం, రోగుల కేర్‌కు అవసరమైన ఓసీటీ మెషిన్, విజువల్ ఫీల్డ్ అనలైజ ర్, జనరేటర్ అవసరం ఉందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకురాగా వాటన్నింటినీ సమకూర్చేందు కు చర్యలు తీసుకుంటామన్నారు. వైద్యశాలలో సీఎస్‌ఆర్ నిధులు రూ.2.60 లక్షలతో ఏర్పాటు చేసిన రెండు మినరల్ వాటర్ ప్లాంట్‌లను మంత్రి ప్రారంభించారు. సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, డాక్టర్ పి.వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

నిర్లక్ష్యపు వైద్యులను సస్పెండ్ చేయాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలోని బాపూజీ నగర్‌కు చెందిన కె.దానమ్మ మృతికి కారణమైన శివానీ ఆసుపత్రి గైనకాలజిస్టు డాక్టర్ బి.మహేశ్వరి, అనస్థీషియా డాక్టర్ మురళీ ప్రభాకరరెడ్డిని సస్పెండ్ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు సుభాష్ చంద్రబోస్ డిమాండ్ చేశారు. సోమవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. 3 నెలల గర్భంతో దానమ్మ ఆసుపత్రికి వెళితే 77 రోజుల పాటు చికిత్స చేసి రూ.3 లక్షలు ఫీజు వసూలు చేశారని, చివరి దశలో హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తీసుకెళ్లాలని చెప్పారన్నారు. అక్కడ కొన్ని రోజులు చికిత్స చేసి రూ.15 లక్షలు ఫీజు వసూలు చేశారని, అయితే ఆమెను ముందుగానే తీసుకొచ్చి ఉంటే బతికించే వాళ్లమని అక్కడి వైద్యులు చెప్పారన్నారు. డబ్బు కోసం శివానీ ఆసుపత్రి యాజమాన్యం దానమ్మ ప్రాణాలను బలి తీసుకుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఆసుపత్రిని సీజ్ చేయాలని కోరుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలి

కర్నూలు న్యూసిటీ: అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.నిర్మల డిమాండ్ చేశారు. ఈ మేరకు కర్నూలు అర్బన్ సీడీపీఓ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేద గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఎంతో సేవలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లకు చాలీచాలని వేతనాలు ఇస్తూ ఆర్థిక ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. పెండింగ్‌లో ఉన్న సెంటర్ల అద్దెలు, టీఏ బిల్లులు చెల్లించాలని కోరారు. ఖాళీగా ఉన్న సూపర్‌వైజర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

మందుబాబులకు జరిమానా

కర్నూలు (టౌన్): నగరంలోని మూడవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో బహిరంగంగా మద్యం సేవిస్తున్న 16 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వారిని సోమవారం కర్నూలు జూనియర్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా ఒక్కొక్కరికి రూ.1000, అలాగే డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఆరుగురికి రూ.3 వేలు చొప్పున జరిమానా విధించినట్లు వెల్లడించారు.

సుందరయ్య పార్కును అభివృద్ధి చేయాలి

కల్లూరు: కల్లూరు అర్బన్ 37వ వార్డులో ఉన్న పుచ్చలపల్లి సుందరయ్య పార్కును అభివృద్ధి చేయాలని సీపీఎం నగర కార్యదర్శి టి.రాముడు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నగరంలో అనేకచోట్ల స్థలాలు ఉన్నప్పటికీ సుందరయ్య పార్కులో ఫిల్టర్ బెడ్‌కు శంకుస్థాపన చేయడం తగదన్నారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకొని వేరే ప్రాంతంలో ఫిల్టర్ బెడ్ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్, జిల్లా కలెక్టర్‌ను కోరారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు

కర్నూలు న్యూసిటీ: వంద సంవత్సరాల చరిత్ర కలిగిన కెనరా బ్యాంకులో వినియోగదారులకు సంరక్షితమైన సేవలు అందిస్తున్నామని కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ సుశాంత్‌కుమార్ తెలిపారు. బ్యాంకు అందిస్తున్న పలు పథకాలపై సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ మన్సరుద్దీన్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. పెరుగుతున్న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అనుమానాస్పద ఫోన్ కాల్స్, మెసేజెస్ వస్తే స్పందించవద్దని, పోలీసులను సంప్రదించాలన్నారు.

సీపీఎం సీనియర్ నాయకుడి మృతి

కర్నూలు(సెంట్రల్): రాయలసీమ పేపర్ మిల్లులో కార్మికుడిగా పనిచేస్తూ ప్రజా నాట్య మండలి కళాకారుడిగా ఎదగడంతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై గళమెత్తిన రాజగోపాల్ గళం మూగబోయింది. సోమవారం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్‌కు వెళ్లిన సందర్భంలో గుండెపోటుకు గురై ఆయన మృతి చెందాడు. ఆయన నగరంలోని బండిమెట్ట కార్పొరేటర్‌గా ఉన్న సమయంలో ప్రజల కోసం చేసిన సేవలు, కళాకారుడిగా విప్లవ గీతాలు పాడిన వైనాన్ని కార్యకర్తలు గుర్తుకు తెచ్చుకుంటున్నారు. చివరి వరకు సీపీఎం కార్యకర్తగా ఉంటూ చనిపోవడంతో ఆయన మృతికి న్యూసిటీ కమిటీ సంతాపం తెలిపింది. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటిస్తున్నట్లు ఆ పార్టీ నగర కార్యదర్శి టి.రాముడు తెలిపారు.

వసతి గృహాల్లో జిల్లా జడ్జి తనిఖీ

కల్లూరు: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా జడ్జి జి.కబర్ధి, కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి సోమవారం పెద్దపాడులోని ఎస్సీ వసతి గృహం, దామోదరం సంజీవయ్య బాలసదన్ హాస్టల్‌ను తనిఖీ చేశారు. హాస్టళ్లలో కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. వసతి గృహాల్లో ఆహారం నాణ్యత, పరిశుభ్రతను పరిశీలించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలని, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

నటి కృష్ణవేణికి అశ్రునివాళి

కర్నూలు కల్చరల్: తొలి మహిళా సినీ నిర్మాత, అందాల నటి మధుర గాయని కృష్ణవేణి మృతికి పద్మశ్రీ ఘంటసాల గాన కళా సమితి అధ్యక్షుడు ఎస్.వాసుదేవమూర్తి, చంద్రశేఖర కల్కూర, డాక్టర్ చంద్రశేఖర్, డబ్ల్యూ సీతారాం, భవానీప్రసాద్, శంకర్ శర్మ, సాయికుమార్, ఉమానాథరావు, నగేష్, పత్తిఓబులయ్య, ఎలమర్తి రమణయ్య, రాఘవేంద్ర ప్రసాద్, జగన్నాథ గుప్త, బీఎస్ రావు తదితరులు సంతాపం ప్రకటించారు. ఎన్టీఆర్, అమర గాయకుడు ఘంటసాలను చలన చిత్రసీమకు కృష్ణవేణే పరిచయం చేసిందని వారు గుర్తు చేసుకున్నారు. ఆమె వంద సంవత్సరాలు జీవించి చిత్ర సీమకు వెయ్యేళ్ల భవిష్యత్తును అందించిన ఆమె మృతి సినీ పరిశ్రమకు తీరని లోటని పేర్కొన్నారు.

వేతనాలు పెంచండి.. బకాయిలు చెల్లించండి

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పారిశుద్ధ్య విభాగంలో పనిచేసే 200 మంది తాత్కాలిక కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ అధ్యక్షుడు నారాయణ డిమాండ్ చేశారు. అలాగే వేతనాలను రూ.15 వేలకు పెంచాలన్నారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని వివిధ కాలనీల నుంచి ప్రజలు తమ దరఖాస్తులను కమిషనర్ ఎస్.రవీంద్రబాబుకు అందజేశారు. స్పందించిన కమిషనర్ వినతుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదనపు కమిషనర్ కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ప్రజారోగ్యశాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

ఫిర్యాదులు ఇవే..

- వెంకటరమణ కాలనీ 2వ లైన్‌లో పూడికతీత పనులు చేపట్టాలని, ఖాళీ స్థలంలో చెత్త చెదారం తొలగించాలని స్థానికులు రాజేంద్ర, వీరేంద్రకుమార్ విన్నవించారు.
- బిర్లా కాంపౌండ్‌లోని విష్ణు అపార్టుమెంట్‌లో కోతుల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు మంజుల, ప్రకాష్‌బాబు వినతిపత్రం ఇచ్చారు.
- ల్యాండ్ మార్క్ అవెన్యూ వెంచర్‌లో పైపులైన్ ఉంది. అయితే నీటి సరఫరా లేదని తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు మధు, అశోక్ అభ్యర్థించారు.
- 19వ వార్డు మారుతి నగర్ జ్యుడీషియల్ ఎంప్లాయీస్ కాలనీలో రహదారులు, మురుగు కాల్వలు నిర్మించాలని స్థానికులు హబీబున్నీసా, మహబూబ్ సాహెబ్ విన్నవించారు.
- కల్లూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో 15 ఏళ్లుగా నివసిస్తున్నామని, ఇప్పటివరకు నగరపాలక సంస్థ అధికారులు మౌలిక సదుపాయాలు కల్పించలేదని స్థానికులు శ్రీదేవి, మంజుల, శారద విన్నవించారు.
- విఠల్ నగర్‌లో పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేపట్టాలని, కాలనీలో మురుగు కాల్వలను ప్రధాన కాలువకు అనుసంధానం చేయాలని స్థానికులు కేదార్‌నాథ్ విన్నవించారు.
- లేపాక్షి నగర్‌లో మురుగు బయటకు వెళ్లేందుకు ఆస్కారం లేనందున మురుగు కాల్వలను పొడిగించాలని స్థానికులు రామానాయుడు, శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు.



ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

జర్నలిస్ట్ డైరీని ఆవిష్కరించిన ఎస్పీ

కర్నూలు: జర్నలిస్టులు ఐక్యతగా ఉండేలా డైరీ తీసుకురావడం మంచి పరిణామమని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ మీడియా డైరీని సోమవారం క్యాంపు కార్యాలయంలో ఎస్పీ ఆవిష్కరించారు. ఆ సంఘం నగర అధ్యక్షుడు శివశంకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గీతాంజలి నర్సింగ్ కళాశాల అధినేత పెరుగు విజయవర్ధన్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, గోరంట్లప్ప, కేబీ శ్రీనివాసులు, ఫొటో గ్రాఫర్ అసోషియేషన్ రాష్ట్ర నాయకులు డి.హుస్సేన్, జిల్లా కన్వీనర్ నాగంద్ర, నగర గౌరవాధ్యక్షుడు శివకుమార్, ప్రధాన కార్యదర్శి ఎర్రమల తదితరులు డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏపీడబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో డైరీ తీసుకురావడం ఆ సంఘం ప్రత్యేకతగా నిలిచిందని ఎస్పీ అభినందించారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు సునీల్‌కుమార్, శ్రీనివాసులు, బ్రహ్మయ్య, పరశురాముడు, బాబు శ్రీరామ్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్, జర్నలిస్టు సంఘం నాయకులు

మిర్చి ఘాటుతో ఇబ్బందులు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు తీసుకొచ్చే ఎండుమిర్చి ఘాటుతో పరిసర కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఘాటును తగ్గించే దిశగా తగిన చర్యలు తీసుకోవాలని భారత ప్రజాతంత్ర మహిళ సంఘం (ఐద్వా) కర్నూలు శాఖ ప్రతినిధులు మార్కెట్ కమిటీ సెక్రటరీని కోరారు. సోమవారం ఐద్వా అధ్యక్షురాలు కే.అరుణ, 43వ వార్డు కార్యదర్శి కుమారి, నాయకురాళ్లు సుజాత, సావిత్రమ్మ తదితరులు మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మార్కెట్‌కు రోజూ వందలాది క్వింటాళ్ల మిర్చి వస్తోందని, దీని ప్రభావం వల్ల 43వ వార్డులోని పీవీ నరసింహరావు నగర్, రెవెన్యూ కాలనీ, ఇందిరాగాంధీ నగర్, ఇల్లూరు నగర్‌కు మిర్చి ఘాటు వస్తోందన్నారు. దీంతో చిన్న పిల్లలు, వృద్ధులు దగ్గు, శ్వాస సంబంధిత వ్యాధులతో పడుతున్నారని పేర్కొన్నారు. మిర్చి ఘాటును తగ్గించే దిశగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి స్పందిస్తూ.. అన్ని విషయాలు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.



మార్కెట్ కమిటీ సెక్రటరీకి వినతి పత్రం సమర్పిస్తున్న ఐద్వా ప్రతినిధులు

ఇరువర్గాల మధ్య భూవివాదం

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని ఉల్చాలలో గ్రామకంఠం భూమిగా ఉన్న కుక్కల కుంటను హిందూ శ్మశాన వాటికకు కేటాయించాలని ఒక వర్గం, కుంటను పూడ్చి పార్కును ఏర్పాటు చేయాలని మరో వర్గం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఇరు వర్గాల మధ్య వాగ్వాదం ఏర్పడింది. ఘర్షణ వాతావరణం నెలకొనడంతో పంచాయతీ అధికారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కర్నూలు తాలుకా అర్బన్ ఎస్‌ఐలు, రూరల్ తహసీల్దార్ టి.వి.రమేష్‌బాబు, ఎంపీడీఓ రఘునాథ్ గ్రామానికి చేరుకొని వారిని సమాధానపరిచారు. ఇరువర్గాల వాదనలు విని సమస్యను పరిష్కరించే వరకు సంయమనం పాటించాలని, గ్రామంలో ఘర్షణలకు దిగవద్దని సూచించారు.

గ్రామాభివృద్ధిని అడ్డుకుంటున్నారు.

గ్రామకంఠం భూమిగా ఉన్న కుక్కలకుంట జి.సిగవరం గ్రామానికి రోడ్డు పక్కనే ఉండటం వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో ఈ కుంటలో ప్రమాదవశాత్తు పడి ఇద్దరు మరణించారు. చెత్తాచెదారం, జంతువులు మరణిస్తే కళేబరాలను తీసుకొచ్చి కుంటలో వేస్తుండటంపై ఒక వర్గం వారు గ్రామ పంచాయతీ దృష్టికి తీసుకొచ్చారు. గ్రామ సర్పంచ్‌గా సమస్య పరిష్కరించేందుకు కుంటను పూడ్చి పార్కును ఏర్పాటు చేయాలని పంచాయతీ తీర్మానం చేశాం. సోమవారం కుంటను పూడ్చుతుండగా ఓ వర్గం వారు అడ్డుకుని వివాదం సృష్టించారు. కూటమి నాయకులు రెండు వర్గాల వారిని రెచ్చగొట్టి ప్రశాంతంగా ఉన్న గ్రామంలో చిచ్చు పెడుతున్నారు. గ్రామాభివృద్ధికి అడ్డంకులు సృష్టిస్తున్నారు.



ఇరువర్గాల వారికి నచ్చజెబుతున్న అధికారులు

అంటరానితనాన్ని నిర్మూలించాలి

కర్నూలు(సెంట్రల్): మంత్రాలయం మండలం చట్నేహళ్లిలో మాదిగల ఇంటి ముందు శవాలను పూడ్చుతున్నా అడ్డుకోవడంలో అధికారులు విఫలమయ్యారని జైభీమ్ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు చిక్కం జానయ్య, జిల్లా అధ్యక్షుడు ముత్తు సుమాల ఆరోపించారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో గాంధీ విగ్రహం ఎదుట బైఠాయించి అధికారుల తీరుపై మండిపడ్డారు. వారు మాట్లాడుతూ.. 20 రోజుల నుంచి చిట్నేహళ్లిలో మాదిగలు అంటరానితనానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శ్మశాన స్థలం కబ్జాకు గురికావడంతో మాదిగల ఇళ్ల ముందే శవాలను పూడ్చి పెడుతున్నారని వాపోయారు. వెంటనే శ్మశానానికి కేటాయించిన స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు ప్రశాంత్‌కుమార్, హనుమన్న, మహేష్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న జైభీమ్ ఎమ్మార్పీఎస్ నాయకులు